

బీఆర్‌ఎస్‌లో చేరిన మహిళలతో కలిసి నినాదాలు చేస్తున్న మంత్రి వేముల

## అభివృద్ధి, సంక్షేమం చూసి బీఆర్‌ఎస్‌లో చేరికలు

### -మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి

వేల్పూర్, నవంబర్ 13 : సీఎం కేసీఆర్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు, బీఆర్‌ఎస్‌లో చేరుతున్నారని మంత్రి ప్రశాంత్‌రెడ్డి అన్నారు. బాల్కొండ నియోజకవర్గంలోని వివిధ గ్రామాల నుంచి కాంగ్రెస్, బీజేపీ, బీఎస్పీలకు చెందిన నాయకులు ఆదివారం బీఆర్‌ఎస్‌లో చేరగా, వారికి మంత్రి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కమ్మర్‌పల్లి మండలం హాసాకొత్తూర్ గ్రామంలోని రెడ్డి సంఘం యువకులు, ఎస్సీ సంఘం మహిళలు, లక్కోరా గ్రామానికి చెందిన వింగ్స్ యూత్ సభ్యులు, నాగంపేట్ గ్రామానికి చెందిన మహిళలు మంత్రి సమక్షంలో గులాబీ కండువా కప్పుకొన్నారు. బీఆర్‌ఎస్‌లో చేరిన వారిలో ఏర్గట్ల మండలం తొర్తి గ్రామానికి చెందిన బీజేపీ సీనియర్ నాయకుడు వేశాల సత్తెయ్య, బీఎస్పీ మండల అధ్యక్షుడు జంబుక రాజన్న, బీఎస్పీ సీనియర్ కార్యకర్త నాయుడు రాజు, పీవైఎల్ (నిజామాబాద్) జనరల్ సెక్రెటరీ ఈర్గాల సృజన్, ఏర్గట్ల మండల పాస్టర్ల సంఘ కార్యవర్గ సభ్యుడు జోసెఫ్, తొర్తి గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు ఈర్గాల నర్సయ్య, కొలిప్యాక అశోక్, మోర్తాడ్ గంగాధర్, బొజ్జు వినోద్, బొజ్జ రవిదాస్, బొజ్జ భీమసేనుడు, బెల్లారి రాజేశ్వర్, బండారి నవీన్, గురుల శంకర్, భీమ్‌గల్ మండలం గోన్‌గొప్పుల గ్రామానికి చెందిన గొల్ల, కుర్మ యువజన సంఘం సభ్యులు, వివేకానంద యూత్ సభ్యులు ఉన్నారు.



గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ప్రశాంత్‌రెడ్డి

- గెలుపోటములు నిర్ణయించేది వారే
- నగరంలో శాంతిభద్రతలను కాపాడడం మా కర్తవ్యం
- ఐటీహబ్, వైకుంఠధామం, మినీ ట్యాంక్‌బండ్ వద్ద చర్చ పెడితే.. ఎదురుగానే అభివృద్ధి కనిపించేది
- మీరు కులమతాల పేరిట చిచ్చుపెట్టి గెలవాలనుకుంటున్నారు..
- మేము చేసిన అభివృద్ధిని ప్రజల ముందు పెట్టి ఓట్లడుగుతున్నాం..
- విలేకరుల సమావేశంలో అర్బన్ ఎమ్మెల్యే గణేశ్‌గుప్తా

# ప్రజలే మాకు బాస్



నగరంలో చేసిన అభివృద్ధి గురించి వివరిస్తున్న అర్బన్ ఎమ్మెల్యే గణేశ్‌గుప్తా

ఖలీల్‌వాడి, నవంబర్ 13 : తనను గెలిపించింది ప్రజలేనని, వారికే తాను జవాబుదారీగా ఉంటానని బీఆర్‌ఎస్ అర్బన్ అభ్యర్థి, ఎమ్మెల్యే బిగాల గణేశ్‌గుప్తా అన్నారు. తనకు ప్రజలే బాస్ అని స్పష్టం చేశారు. నగర అభివృద్ధిపై బీజేపీ అభ్యర్థి విసిరిన సవాల్‌ను స్వీకరించిన బిగాల.. నగరంలోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో సోమవారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. శాంతిభద్రతల సమస్యలు వస్తాయని పోలీసులు సూచించడంతో తాను డిబేట్‌కు వెళ్లలేదని ముందుగా స్పష్టం చేశారు. నగరం ప్రశాంతంగా ఉంచడమే తన మొదటి కర్తవ్యమన్నారు.

**గుడుల పేరిట రాజకీయాలు చేయను..**

సీఎం కేసీఆర్ ఆదేశాలు, ప్రజల ఆశీర్వాదంతో నాల్గోసారి ఎన్నికల్లో పోటీ చేస్తున్నానని బిగాల తెలిపారు. 2009లో ఎంపీగా, 2014, 2018తోపాటు ప్రస్తుతం ఎమ్మెల్యేగా పోటీలో ఉన్నట్లు చెప్పారు. ఆరోగ్యకరమైన రాజకీయాలు, చేసిన అభివృద్ధి గురించే తాను ఇప్పటివరకు మాట్లాడానని, ప్రత్యర్థుల పేర్లను కూడా ఎన్నడూ ప్రస్తావించలేదని గుర్తుచేశారు. బీజేపీ అర్బన్ అభ్యర్థి కొద్దిరోజులుగా అభివృద్ధిపై చర్చకు సిద్ధమా అంటూ సవాల్ చేస్తుంటే తాను స్వీకరించానన్నారు. నగరంలోని మినీ ట్యాంక్‌బండ్, వైకుంఠధామం లేదంటే ఐటీ హబ్ దగ్గర చర్చ పెడితే.. తాను చేసిన అభివృద్ధి కూడా ఎదురుగానే కనిపించేదన్నారు. గుడి, బడి కూడా కట్టించానని, కానీ ఆలయాల పేరిట రాజకీయాలు చేసే వ్యక్తిని కాదన్నారు.

**చేతనైతే అభివృద్ధి చేసి చూపించండి..**

2014, 2018 ఎన్నికల్లో తాము చేసిన అభివృద్ధిపై కరపత్రాలు ప్రచురిస్తే.. అవి రంగుల బొమ్మలంటూ హేళన చేశారని మండిపడ్డారు. అభివృద్ధి పనులన్నీ ప్రస్తుతం ప్రజలకు అందుబాటులో ఉన్న విషయం అందరికీ తెలుసని అన్నారు. చేతనైతే మీరు కూడా అభివృద్ధి పనులు, ప్రజలకు సేవ చేయాలని, ఐటీ హబ్ తీసుకువచ్చి ఉద్యోగాలు కల్పించాలని సూచించారు. అంతేకానీ అవగాహనా రాహిత్యంతో విమర్శలు చేయొద్దని హితవు పలికారు. నగరంలో హైదరాబాద్ తరహాలో మినీ ట్యాంక్‌బండ్, మహాప్రస్థానానికి దీటుగా వైకుంఠధామాలు నిర్మించినట్లు చెప్పారు.

**విద్వేషాలు రెచ్చగొట్టేవారికి బుద్ధి చెప్పాలి..**

మరోసారి అధికారంలోకి వచ్చిన వెంటనే 24 గంటలపాటు తాగునీరు, ప్రతి ఇంటికీ అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ కనెక్షన్లు ఉచితంగా ఇస్తామన్నారు. బీజేపీ నాయకులు గతంలో కులమతాల మధ్య చిచ్చుపెట్టి, తప్పుడు ఆరోపణలతో మున్సిపల్ ఎన్నికల్లో గెలవాలని చూశారని, అయినా రెండుసార్లు కార్పొరేషన్‌పై గులాబీజెండాను ఎగురవేశామన్నారు. మరోసారి మతవిద్వేషాలు రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నారని, అప్రమత్తంగా ఉండి తగిన బుద్ధి చెప్పాలని ప్రజలకు సూచించారు. రాష్ట్రంలో ఒకపార్టీ.. నగరంలో మరోపార్టీ ఎమ్మెల్యే ఉంటే గతంలో నగరం అభివృద్ధిచెందలేదనే విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. ప్రజలకు స్వేచ్ఛగా ఓటు వేసే హక్కు ఉందని, నగరంలో మరింత అభివృద్ధి, సంక్షేమం కొనసాగాలంటే కారు గుర్తుకు ఓటు వేసి బీఆర్‌ఎస్‌ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నగర మేయర్ దండు నీతూకిరణ్, మాజీ మేయర్ ఆకుల సుజాత, నుడా మాజీ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు సుజిత్‌సింగ్ ఠాకూర్, సూదం రవిచందర్, సత్యప్రకాశ్, సిర్ప రాజు, ఎనుగందుల మురళి, ధర్మపురి, అక్బర్ హుస్సేన్, రాజేంద్రప్రసాద్, అంబదాస్, మాదని శ్రీధర్, ఆర్‌ఎల్ నర్సింహా, గోపరి లక్ష్మణ్, కొవ్వూరి జగన్, గంగామణి, కరిపె రాజు పాల్గొన్నారు.

# పరమ పవిత్రం కార్తీకం..



- భక్తితో పూజలు, నదీస్నానాలు, వ్రతాలు
- శివ కేశవులకు అభిషేకాలు
- నేటి నుంచి కార్తీక మాసం ప్రారంభం

నిజామాబాద్ కల్చరల్, నవంబర్ 13 : శివకేశవులకు ప్రీతికరమైన కార్తీకమాసం నేటి (మంగళవారం) నుంచి ప్రారంభం కానున్నది. మహిళలకు కూడా ఎంతో పవిత్రం. వేకువ జామున స్నానాలు, తులసి పూజలు, నోములు, ఉపవాసాలు.. భక్తిభావాన్ని పెంచడంతోపాటు ఆరోగ్యానికి కూడా మేలు చేస్తాయి. దీపాల కాంతితో కళకళలాడే ఆలయాలు.. శివనామస్మరణతో భక్తులు చేపట్టే ఉపవాసాలు పండుగ వాతావరణాన్ని తలపిస్తాయి. హరిహరులకు ఇష్టమైన మాసంగా పరిగణించే కార్తీకమాసంలో చేసే పూజలు, వ్రతాలు, నదీస్నానాలకు విశేషమైన ఫలితం ఉంటుందని పురాణాలు పేర్కొంటున్నాయి.

**కృతిక నక్షత్రం..**

చంద్రుడు పూర్ణుడై ఏ నక్షత్రంలో ఉంటాడో ఆ నక్షత్రం పేరు ఆ మాసానికి వస్తుంది. కృతికా నక్షత్రంలో చంద్రుడు పూర్ణుడై సంచరించడంతో ఈ మాసానికి కార్తీక మాసం అనే పేరు వచ్చింది. దేవతలలో మొదటివాడైన అగ్నిదేవుడు ఈ నక్షత్రానికి అధిపతి. కృతిక అంటే ఆరు ముఖాలు కలవాడు. కుమారస్వామిని షణ్ముఖుడు అని, కార్తీకమాసంలోనే అయ్యప్పస్వామి ఆరాధన విశేషమని పురాణాలు చెబుతున్నాయి.

**కార్తీక దీపాలు..**

ఈ మాసంలో వచ్చే సోమవారాలు శివుడికి ఎంతో ఇష్టమైన కాలం. ఉదయం, సాయంత్రం వేళల్లో దీపాలు వెలిగిస్తే మనోవాంఛలు నెరవేరుతాయని భక్తుల ప్రగాఢ నమ్మకం. ఉసిరిని విష్ణురూపంగా, తులసిని లక్ష్మీదేవిగా ఆరాధించి పూజలు చేస్తే దాంపత్యం, సంతానప్రాప్తి కలుగుతుందని పురాణాలు చెబుతున్నాయి.

**ప్రత్యేక పర్వదినాలు..**

ఈ నెల 17న శుక్రవారం నాగుల చవితి, 20న మొదటి కార్తీక సోమవారం, 27న రెండో కార్తీక సోమవారం, డిసెంబర్ 4న మూడో కార్తీక సోమవారం, డిసెంబర్ 11న నాల్గవ కార్తీక సోమవారం, 23న గురువారం ఏకాదశి, 24న శుక్రవారం క్షీరాబ్ది ద్వాదశి, 26న ఆదివారం కార్తీక పౌర్ణమి, తులసి లగ్నాలు, సత్యనారాయణ వ్రతాలు, 30న ఆరుద్ర నక్షత్ర హోమాలు తదితర శుభ దినాలు.

### కల్లం వద్ద వడ్లు ఖాళీ చేస్తుండగా..

## విద్యుత్ షాక్‌తో రైతు మృతి



సామ చిన్నగంగాధర్ (ఫైల్)

కమ్మర్‌పల్లి, నవంబర్ 13 : కల్లం వద్ద వడ్లు ఖాళీ చేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్ తగిలి రైతు మృతిచెందిన ఘటన మండలంలోని హాసకొత్తూర్ గ్రామంలో చోటుచేసుకున్నది. గ్రామానికి చెందిన సామ చిన్నగంగాధర్ (55) సోమవారం కోసిన వడ్లను తన ట్రాక్టర్‌లో నింపుకొని సమీపంలోని కల్లం వద్ద ఆరబోయడానికి తీసుకువచ్చాడు. స్థానిక యువకుడు ట్రాలీ జాక్‌ను పైకెత్తుతుండగా, గంగాధర్ ట్రాక్టర్ దిగి సూచనలిస్తున్నాడు. ఈ క్రమంలో పైన ఉన్న 11కేవీ విద్యుత్ లైన్‌కు ట్రాలీ తగిలింది. ప్రమాదాన్ని పసిగట్టిన యువకుడు వెంటనే కిందకు దూకేశాడు. ఏం జరిగిందో అర్థం కాక.. పరిశీలించే క్రమంలో గంగాధర్ ట్రాక్టర్‌ను పట్టుకున్నాడు. దీంతో విద్యుత్ షాక్ తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. గ్రామస్తులు, ఉపసర్పంచ్ సమాచారం మేరకు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆర్మూర్ ప్రభుత్వ దవాఖానకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై రాజశేఖర్ తెలిపారు.

## శివాజీ విగ్రహ ఏర్పాటుకు స్థల పరిశీలన



ఏర్గట్లలో స్థలాన్ని పరిశీలిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

ఏర్గట్ల, నవంబర్ 13 : మండల కేంద్రంలో ఛత్రపతి శివాజీ విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు గుర్తించిన స్థలాన్ని ఎంపీపీ ఉపేందర్‌రెడ్డి, జడ్పీటీసీ రాజేశ్వర్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రాజపూర్ణానందం సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మంత్రి ప్రశాంత్‌రెడ్డి ఆదేశాల మేరకు స్థలాన్ని పరిశీలించినట్లు చెప్పారు. ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు మధుసూదన్, రైతుబంధు సమితి మండల అధ్యక్షుడు అంజయ్య, సొసైటీ చైర్మన్, వైస్ చైర్మన్ చిన్న నర్సయ్య, గంగారాం, సర్పంచ్ లావణ్యాగంగాధర్, బీఆర్‌ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, నాయకులు రాజేందర్ యాదవ్, సహదేవ్, వడ్ల గంగాధర్, ఎస్‌ఎంసీ చైర్మన్ నరేశ్ పాల్గొన్నారు.